క్లుప్తంగా

జ్వరాలపై ఆందోళన చెందవద్దు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నర్సింగరావు

కోరుట్ల: పట్టణంలో ప్రబలుతున్న జ్వరాలపై ప్రజలు ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఐఎంఏ కోరుట్ల అధ్యక్షుడు రేగొండ రాజేశ్ డెంగీ జ్వరాలపై రూపొందించిన కరపత్రాన్ని నర్సింగరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ కర పత్రంలో డెంగీ లక్షణాలు, నివారణకు ముందు జాగ్రత్తలు వివరించారు. జ్వరంతో బాధపడే వారు రక్తపరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలని, ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని డాక్టర్ రేగొండ రాజేశ్ అన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ సెంట్రల్ కమిటీ మెంబర్ డాక్టర్ అనూప్ రావు, మాజీ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మేడిపల్లి: రెండు నెలలకు పైగా తమ కాలనీలో వీధి దీపాలు, డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తొంబరావుపేట గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో పద్మజకు వినతి పత్రం అందించారు. పారిశుధ్యలోపం, దుర్వాసన, దోమలతో కాలనీలో ఉండలేకపోతున్నామని, ఎస్సీ కాలనీలో రెండు నెలల నుండి డ్రెనేజీ తీయడం లేదని, వీధిదీపాలు వెలగటం లేదని, దీనిపై గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినాన పట్టించుకోవడంలేదని వాపోయారు. గట్టిగా ప్రశ్నిస్తే ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండని దురుసుగా మాట్లాడుతున్నాడని ఫిర్యాదు చేశారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

సారంగాపూర్: గ్రామపంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు (సిబ్బంది) సోమవారం బీర్‌పూర్ ఎంపీడీవో భీమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి బకాయిపడి ఉన్న వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని కోరారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

కరాటే బెల్ట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: పట్టణంలోని గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు కరాటే బెల్ట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఉమేరియా సుల్తానా తెలిపారు. జగిత్యాలలో పవన్ అకాడమీ శోటోకాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ టెస్ట్‌లో బ్లాక్, మెరున్, బ్లూ, ఎల్లో, బెల్టులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రూ. 100 కోట్లకు చేరిన బ్యాంక్ టర్నోవర్



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది, బ్యాంకు మేనేజర్

పెగడపల్లి: మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్ రూ. 100 కోట్లుకు చేరింది. రూ. 26 కోట్లు డిపాజిట్లు, రూ. 74 కోట్లు వివిధ రకాలు రుణాలతో వంద కోట్లు టర్నోవర్ చేరింది. ఈ మేరకు సోమవారం బ్యాంకు సిబ్బంది వినియోగదారుల సమక్షంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అవసరాల మేరకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది చారీ, అర్జున్, కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, సీఈవో గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు కరువు

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- గుంతలు, నిల్వ నీటితో రాకపోకలకు ఇబ్బందులు



12 వార్డులోని ఓ వీధిలో గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్డు

మెట్‌పల్లి: పట్టణంలోని శివారు కాలనీల్లో ఉన్న మట్టి రహదారులు అధ్వానంగా మారాయి. చాలా చోట్ల రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పాటు రోడ్లు బురదమయ్యాయి. దీంతో నడవలేని పరిస్థితి నెలకొందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు..

- ➡ పట్టణంలో 26 వార్డులున్నాయి. ఇందులో శివారు కాలనీలైన టీచర్స్ కాలనీ, సిద్ధి వినాయకనగర్, సాయిరాంకాలనీ, వెంకట్రావ్‌పేట, బాలకిషన్‌నగర్, ముస్లింపురా, హన్మాన్‌నగర్, బీడీ కాలనీ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా మట్టి రహదారులు ఉన్నాయి.
- ➡ వీటిని సీసీగా మార్చకపోవడంతో చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి.
- ➡ ఇటీవల వంద రోజుల ప్రణాళికలో భాగంగా కొన్ని చోట్ల గుంతలకు మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ➡ ప్రతి ఏటా పన్నులను సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం మౌలిక వసతులను కల్పించడం లేదని ఆయా కాలనీల ప్రజలు విమర్శిస్తున్నారు.

నిమజ్జనోత్సవానికి తిప్పలు

- ➡ వినాయక నిమజ్జనోత్సవం రోజున విగ్రహాలతో ఊరేగింపుగా వెళ్లే వాహనాలకు గుంతలతో ఇబ్బందులు తలెత్తే అవకాశముంది.
- ➡ పట్టణం మొత్తం మీద సుమారు 200 వినాయక మండపాలను ఏర్పాటు చేశారు.
- ➡ ఈ గుంతల వల్ల ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదాలు జరిగే అవకాశముంటుంది.
- ➡ మున్సిపల్ అధికారులు స్పందించి అంతర్గత, ప్రధాన రహదారులపై ఏర్పడ్డ గుంతలకు వెంటనే మరమ్మతు చేపట్టాలని మండపాల నిర్వాహకులు కోరుతున్నారు.

దృష్టి సారిస్తాం

దెబ్బతిన్న రహదారుల్లో ఇప్పటికే కొన్ని చోట్ల తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాం. రవాణాకు ఇబ్బందులు కలుగుతున్న రోడ్ల గురించి తమ దృష్టికి తీసుకవస్తే అవసరమైన చర్యలు తీసుకుంటాం. సీసీరోడ్ల నిర్మాణం కోసం కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. - నాగేశ్వర్‌రావు, డీఈఈ



బుగ్గారం: ధర్మపురి–జగిత్యాల మధ్య జాతీయ రహదారి 63పై నేరెళ్ల గుట్ట వద్ద గల మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మూలమలుపు వద్ద వాగు సైతం ప్రవహిస్తుండడంతో వర్షాలు కురిసినప్పుడు రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది.రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన రక్షణ రాళ్లు పూర్తిగా తొలగిపోవడంతో నీరు రోడ్డుపై నుంచి ప్రవహించేటప్పుడు రోడ్డు వెడల్పును వాహనదారులు అంచనా వేయలేకపోతున్నారు. దీంతో ఏమాత్రం అదుపుతప్పినా వాగులో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి అనేక మంది వాహనదారులు చనిపోయారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
గులాబ్ సింగ్, డీఈఈ, ఎన్‌హెచ్ జగిత్యాల సెల్ నంబర్: 8555042424

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కుంకుమ పూజలు.. అన్నదానాలు



జగిత్యాలలో మహిళల పూజలు



అన్నదానం ప్రారంభిస్తున్న జువ్వాడి నర్సింగారావు

కోరుట్ల/కోరుట్లటౌన్/రాయికల్/సారంగాపూర్/మల్లాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో వినాయకమండపాల్లో పలు రకాల పూజలు జరుగుతున్నాయి. సారంగాపూర్ శ్రీరామాలయ సముదాయంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.ధర్మపురి హన్మాన్ ఆలయం ముందు రుద్రసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి వేద బ్రాహ్మణులు పూజలు నిర్వహించారు.రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో గణనాథుల వద్ద సోమవారం మహిళలు కుంకుమపూజలు, అన్నదానం చేశారు. మల్యాల మండల కేంద్రంలో పలు వినాయక మంటపాల వద్ద దీపారాధన నిర్వహించారు. బ్లాక్ ఆఫీస్ వద్ద గణపతి మంటపం వద్ద గోమాత పూజ నిర్వహించారు.

గణనాథుడికి 108 రకాల ప్రసాదాలు

కోరుట్ల పట్టణంలోని గోడలయూత్ గణపతి మండపం వద్ద 108 ప్రసాదాలతో ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు.

కోరుట్ల పట్టణంలోని వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బీమునిదుబ్బ గణేష్ మండపం వద్ద కాంగ్రెస్ కోరుట్ల సెగ్మెంట్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం ప్రారంభించారు.

మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని వినాయక మండపాల్లో సోమవారం కుంకుమార్చనలు, అన్నదానాలతో పాటు ప్రత్యేక పూలు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కొడిమ్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఎంపీడీవో స్వరూప శనివారం కొడిమ్యాల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, బేస్మెంట్ లెవెల్ నుండి లెంటల్ లెవెల్ వరకు, పనులను పూర్తి చేయాలని వారికి ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఏపీవో, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహుల పల్లె పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడి, తమకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని ట్రాక్టర్ డ్రైవర్ నదీం సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇంటిపన్ను రూ.65,500 సొంతానికి వాడుకున్నాడని, కొత్తగా ఏర్పాటైన ఇందిరానగర్ గ్రామపంచాయతీ నుంచి రూ.28,400 వాడుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు ఏప్రిల్ నుంచి వేతనం చెల్లించడం లేదని, కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరాడు.

స్థానిక సంస్థల్లో విజయం సాధించాలి



నామాపూర్‌లో జెండావిష్కరిస్తున్న నాయకులు

పెగడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి బీఆర్‌ఎస్ సత్తా చూపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండలంలోని నామాపూర్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూరియా దొరక రైతులు రోడ్డెక్కుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో విఫలమైందని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, పెద్ది సంతోష్, చిర్ర రమణాకర్, సత్తయ్య, లక్ష్మారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం...వరద

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసి, మళ్లీ వాగులు ఉప్పొంగాయి. సారంగాపూర్‌లో మండల కేంద్రంలో ఉదయం 8 గంటల వరకు 86.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయింది. బీర్‌పూర్ మండలంలో 39.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయింది. సారంగాపూర్ మండలంలో వాగుల వెంట ఉన్న వరి పొలాలు వరదలకు మునిగిపోయాయి. మ్యాడారంతండా–రేచపల్లి గ్రామాల మధ్య ఎగువన నుండి వస్తున్న వరదతో వంతెనపైనుండి భారీ వరద ప్రవహించడంతో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో సురేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జేసీబీల సహాయంతో వరదను దారి మళ్లించి రాకపోకలను పునరుద్ధరించారు.



కూలిన ప్రహరీ

వర్షానికి కూలిన ప్రహరీ

మల్లాపూర్: మండల కేంద్రంలో భారీ వర్షానికి నవాతే పుండరీకంకి చెందిన ఇంటి ప్రహరీ సోమవారం కూలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు సంఘటన స్థలానికి వెళ్లి కూలిన ప్రహరీని పరిశీలించి బాధితుడిని పరామర్శించారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



మనోహర్ దంపతులతో కలెక్టర్లు సత్యప్రసాద్,అనుదీప్

మెట్‌పల్లి: అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని విధిత్ రెడ్డి గార్డెన్‌లో సోమవారం విద్యుత్ శాఖ ఏడీఈ మనోహర్ పదవీ విరమణ సందర్భంగా తెలంగాణ పవర్ డిప్లోమా ఇంజనీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, కానీ ఉద్యోగంలో ఉన్న సమయంలో తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు, మనోహర్ కుమారుడు, ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఎస్‌ఈ సుదర్శనం, డీఈలు మధుసూదన్, గంగారాం, శ్రావణ్‌కుమార్, అసోసియేషన్ నాయకులు, ఏఈలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు జగిత్యాల విద్యార్థిని

జగిత్యాల: ఇటీవల గద్వాల జిల్లా ఉత్తనూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన జగిత్యాలలోని కేజీఆర్ స్కూల్‌లో చదువుకున్న విద్యార్థి సుదన్వి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు పంజాబ్‌లోని లుథియానాలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గంగారెడ్డి, కోచ్ శ్రీరామ్, సంపత్, విజ్ఞాన్ అభినందించారు.

వసతి గృహ బాలికలకు పౌష్టికాహారం పంపిణీ

మెట్‌పల్లి: పట్టణంలోని బాలికల వసతి గృహంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహార దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మంది బాలికలకు డ్రైఫ్రూట్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి బాలికలకు వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు, మర్రి భాస్కర్, గంగాధర్, ముత్యాల వేణు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి

ఇబ్రహీంపట్నం: పర్యావరణం రక్షించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఎంపీడీవో మహమ్మద్ సలీం అన్నారు. సోమవారం వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, మహిళలు, మహిళలతో కలిసి మొక్కలు నాటారు. మహిళ సంఘ సభ్యులు గ్రామాలలో ప్రతి ఇంటి అవరణలలో 2 మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో మధు, ఏపీఎం శంకర్, ఏపీవో కొముదయ్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన సంబరాలు



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడితో చిన్నారులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వినాయకున్ని ప్రతిష్ఠించారు. సోమవారం గణనాథున్ని నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో పాటు పెద్ద ఎత్తున సౌండ్‌సిస్టమ్స్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు.

సారంగాపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని కాలనీవాసులు ఘనంగా నిమజ్జనానికి తరలించారు. ట్రాక్టర్‌ను అలంకరించి, డప్పు చప్పుళ్లతో వర్షాన్ని లెక్కచేయకుండా ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కోరుట్లరూరల్: పట్టణంలోని బెండపెల్లి ప్రాంతంలో అద్దెకుంటున్న మహమ్మద్ చాంద్ పాషా (45) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాంచందర్ కథనం ప్రకారం.. చాంద్‌పాషా పాన్ టేలా నడుపుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మతిస్థిమితం సరిగా లేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. పాషాకు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరికీ పెళ్లయ్యింది. భార్య కైరొన్నీసా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

10 నుంచి మండల స్థాయి క్రీడలు

ఇబ్రహీంపట్నం: ఈ నెల 10 నుంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మధు సోమవారం తెలిపారు. ఈ పోటీలను నిర్వహించేందుకు గాను మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పీడీ, పీఈటీలతో ఎమ్మార్సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వివరాలకు రాజు పీడీ సెల్ నంబర్ 9441183035, రవి పీడీ 9490683248 నంబర్‌లకు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజన్న, పీడీలు రాజు, రవి, అనిత, పీఈటీ సరిత, తదితరులు పాల్గొన్నారు.

మొగిలిపేటలో కూలిన డ్రైనేజీ



భారీ వర్షానికి కూలిన డ్రైయినేజీ

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట్‌లో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిని సోమవారం కూలిపోయింది. రూ.4 లక్షల ఈజీఎస్ నిదులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో డ్రైనేజీ కూలిపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పనుల నాణ్యతను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీడీ కార్మికుల ఆస్పత్రి వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. 1–10వ తరగతి వరకు బీడీ కార్మికులు చదువుతున్న పిల్లలకు స్కాలర్‌షిప్‌ల కోసం ఆగస్టు 31 ఉండగా సెప్టెంబర్ 15 వరకు పొడిగించారని, ఇంటర్మీడియెట్ డిగ్రీ, బీటెక్, ప్రొఫెషనల్ కోర్సులకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యజమాన్యాలు, ఉపాధ్యాయులు బీడీ కార్మికుల పిల్లలతో స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.. మిగతా వివరాలకు గిగిగి. ఇఏబైఉఖఏఇఖ .ఎ౧ఐూ సంప్రదించాలని కోరారు.

ఆత్మగౌరవ సభకు తరలిన ఉద్యోగులు

జగిత్యాలరూరల్: రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సీపీఎస్ రద్దు ఓపీఎస్ అమలు కోసం రాష్ట్ర ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు జగిత్యాల జిల్లా నుంచి రెవెన్యూ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా టీజీఆర్‌ఎస్‌ఏ అధ్యక్షుడు గాలిపల్లి ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చిట్యాల భూమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు దూస రాజశేఖర్, తదితరులు వెళ్లారు.

ఉపాధ్యాయులు నిరసన

కథలాపూర్: ఉపాధ్యాయ ఉద్యోగులకు సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కథలాపూర్ మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులందరికి పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో మధ్యాహ్నభోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

కథలాపూర్: మండలంలోని పోసానిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దోతుల అశోక్ ఉచితంగా నోట్‌బుక్కులు సోమవారం పంపిణీ చేశారు. అశోక్ తన కూతురు మేధస్వీ పుట్టినరోజు సందర్భంగా రూ. 7 వేలు విలువగల నోట్‌బుక్కులు అందించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవుల్లో రాజకీయ చైతన్యం తీసుకువస్తాం

సారంగాపూర్: జిల్లా వ్యాప్తంగా యాదవుల్లో రాజకీయ చైతన్యం తీసుకవస్తామని యాదవ సంఘం జిల్లా అడహాక్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పోతారంలో యాదవ సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వంతో యాదవ సంఘాలు బలోపేతమవుతాయన్నారు. కార్యక్రమంలో పన్నాల హరీష్, భైరి మహస్తేష్, మోతుకు మహేష్, ఎడుమల మల్లేష్, పన్నాల ఐలయ్య, అంకుస్ మధు, రవి, బాపన్న, లెంకల కొమురయ్య తదితరులు ఉన్నారు.

కోమటికొండాపూర్‌కు బస్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటికొండాపూర్‌కు మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సు, మెట్‌పల్లి నుంచి ఇబ్రహీంపట్నం మీదుగా కోమటికొండాపూర్‌కు బస్సును సోమవారం కోమటికొండాపూర్‌లో మహిళా సంఘ సభ్యులు ప్రారంభించారు. బస్సు ప్రారంభానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు జువ్వాడి క్రిష్ణరావు డిపో మేనేజర్ దేవరాజ్‌కు మహిళా సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళ సంఘాల అధ్యక్షురాలు బక్కురి రాధిక, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, నాయకులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల గ్రామానికి చెందిన యువసేన యూత్ సభ్యులు జిల్లా కేంద్రంలోని భగినీ నివేదిత సేవ సమితి లో అనాథ పిలలకు అన్నదానం చేశారు. ప్రతీ సంవత్సరం లాగే, ఈ సంవత్సరం కుడా గణపతి నవరాత్రుల సందర్భంగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

పంట నష్టాలపై అధికారుల సర్వే



పంట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఇబ్రహీంపట్నం: గోదావరి ఉధృతికి మండలంలోని కోమటికొండాపూర్,ఎర్దండి గ్రామాల్లో ఇటీవల పంటలు నీట మునిగాయి. సోమవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి నీటిని తగ్గించడంతో ఏమేమి పంటలు నష్టపోయాయో అధికారులు పరిశీలించి, వివరాలు నమోదు చేస్తున్నారు. మొక్కజొన్న,పసుపు పంటలు అధిక నీటిని తట్టుకోలేవు కాబట్టి వర్షపు నీరు వెంటనే వెళ్లిపోయే విధంగా కాలువలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ బోరిగం రాజు, ఎఈవోలు సాయికృప, రవళిక, రైతులు పాల్గొన్నారు.